గ్రామీణ రైతు బంద్‌ను, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పెదకాకాని : సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక జాతీయ పిలుపు మేరకు పెదకాకాని సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, రైతు కూలి సంఘం కార్యదర్శి దానబోయిన భాస్కర రావులు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జరిగే గ్రామీణ రైతు బంద్‌ను, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ కేంద్రంలో రెండో దఫా అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు హాని కలిగించే మూడు నల్లచట్టాలను తీసుకువస్తే లక్షలాది మంది రైతులు ఢిల్లీ నడివీధులలో వంటావార్పు చేస్తూ సంవత్సరం కాలం పాటు పోరాటం చేస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేను రైతు పక్షపాతిని నేను ఈ చట్టాలను గురించి మీకు వివరించటం చేతకాలేదని నచ్చజెప్పే లేకపోయానని, మూడు చట్టాలను వెనక్కి తీసుకుంటున్నానని నమ్మించి ఉద్యమాన్ని విరివింపజేసి మళ్లీ ఆ నల్లచట్టాలను ప్రవేశపెట్టాలని దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్నారన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని తదితర డిమాండ్లపై ఢిల్లీకి ప్రయాణమైన రైతులను పంజాబ్ ఇతర రాష్ట్రాల సరిహద్దులలో సైన్యాన్ని మోహరించి పొగ బాంబులు, వాటర్ పైపులతో భయభ్రాంతులను చేస్తూ భారీ బారికేడ్లతో ఎక్కడివారిని అక్కడే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించటం అన్యాయమన్నారు. అంతే కాకుండా కార్మికులు దశాబ్దాల పాటు పోరాడి సాధించు కున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక లోకానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై 16న జరిగే భారత్ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ ంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, పెదకాకాని గ్రామ సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌రాజు, సీపీఎం గ్రామ కార్యదర్శి కోటిపల్లి సత్యనారాయణ, నంబూరు సీపీఐ కార్యదర్శి కూసం నాగిరెడ్డి, ఉల్లంఘూల శివయ్య, గోపి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు క్లైమ్‌లను జాగ్రత్తగా పరిశీలించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం జనవరి 23వ తేది నుండి ఫిబ్రవరి 13వ తేది వరకు అందిన క్లైమ్‌లను పరిశీలించి పరిష్కరించాల్సి వుందని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీఖర్‌లతో కలసి ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం జనవరి 23వ తేది నుండి ఫిబ్రవరి 13వ తేది వరకు ఫారం-6 క్రింద 9,733 , ఫారం-6 ఏ క్రింద 29, ఫారం-7 క్రింద 8,394, ఫారం-8 క్రింద 20,470 క్లైమ్స్ అందాయ న్నారు. కొత్తగా వచ్చిన ఈ క్లైమ్స్‌ను ఈఆర్‌ఓలు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఫారం-8 క్రింద ఇతర నియోజకవర్గాల నుండి నివాసం మార్చడం లేదా దిద్దుబాటు కొరకు అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నా యని వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అలాగే ఫారం-6 క్రింద 30 సంవత్సరాల పైబడి వయస్సు వున్న ఓటర్ల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారని రాజ కీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో కోరారు. ఓటర్ల జాబితాపై వచ్చిన వ్యతిరేక వార్తలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తాం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల రైలుపేటలో గత నెల 19న శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన ప్రమాదంలో నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తామని కోల్డ్‌స్టోరేజ్ యాజమాని అల్లుడు అజయ్ కృష్ణ తెలిపారు. బుధవారం కోల్డ్‌స్టోరేజ్‌లో మీడియాతో మాట్లాడుతూ శుభం మహేశ్వరి యజమానికి సంబంధించిన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గత నెల 19 ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించిందని, లక్ష ఇరవై నుంచి, 25 వేల వరకు బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. సుమారు 600 మంది రైతులు సంబంధించిన సరుకును నిల్వ చేశారని, దీనికి సంబంధించిన రూ.40 కోట్ల వరకు భీమా ఉందన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో ఉన్న రికార్డులను తహ శీల్దార్ స్వాధీన పరుచుకోవడం జరిగిందన్నారు. భీమా ఉన్న రైతులందరికీ తగు న్యాయం చేసే విధంగా నగదును అందించడం జరుగుతుందన్నారు.

16న జరిగే గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం కృష్ణ నగర్, నులకపేటలో మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద, లారీ డ్రైవర్స్ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి చేతిప్రతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీమోను, మరియమ్మ, బాజ్జీ, అనుషా, శివమ్మ, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

సీఐ మధుసూదన్‌రావును సత్కరించిన ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇటీవల తాడేపల్లి సీఐగా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌రావును బుధవారం సాయంత్రం ఏఐటీయూసీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, సీపీఐ తాడే పల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కమిటీ సభ్యులు బొర్ల శ్రీనివాసరావు, చదలవాడ సాయిచంద్‌ను కలిసి శాలువాతో సత్కరించారు.

ఉచిత శిక్షణ, కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళ గిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసు కున్న మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మె స్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 47వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 80 మంది మహిళ లకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మహిళల అభ్యున్నతి కోసం, వారి జీవనో పాధి కోసం కృషి చేస్తున్న నారా లోకేష్‌కు కుట్టు మిషన్లు అందు కున్న లబ్దిదారులు ధన్యవాదములు తెలియజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ నారా లోకేష్ ఆర్థిక సహకారంతో నిర్వహి స్తున్న స్త్రీ శక్తి కార్యక్రమం నియోజకవర్గ మహిళలకు ఎంతగానో దోహద పడుతు ందన్నారు. ఆకుల జయసత్య, పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని మండల మాల దీక్ష స్వీకరణ మహోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలో వేంచేసి ఉన్న పానకాల లక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో బుధవారం వైభవంగా నృసింహుని మండల మాల దీక్ష స్వీకరణ మహోత్సవం వైభవ ంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్ల సేవ ట్రస్టీ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవిలు పాల్గొని నృసింహుని భక్తులకు మాల ధారణ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవిలు మాట్లాడుతూ వైసీపీ మాజీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసరావు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్ల సేవ ట్రస్ట్ పేరుతో ప్రతి ఏడాది.. నృసింహుని మాల ధారణ భక్తులకు దుస్తులను అందించమే కాకా, వారికి 41 రోజుల పాటు, దిగువ సన్నిధి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో అన్నా వితరణ కార్యక్రమం కూడా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తొలి విడతగా 140 మంది భక్తులు స్వామి వారి మండల దీక్ష స్వీకరించారు. దీక్ష స్వీకరించిన 140 మంది భక్తులకు దీక్ష వస్త్రాలను తోట శ్రీనివాసరావు ఉచితంగా అందజేశారు. అలాగే మార్చి 5న అర్థమండల దీక్ష, మార్చి 15న 11 రోజుల దీక్ష స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, తాడేపల్లి పట్టణ వైసీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల్ రెడ్డి, ఈదులమూడి డేవిడ్ రాజు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు ఎస్పీకి అభినందనలు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీవీ రమణమూర్తిని బుధవారం టెలికాం సలహా కమిటీ ఉమ్మడి గుంటూరు జిల్లా సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి నిమ్మరాజు చలపతిరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. వీరి వెంట యూనియన్ గుంటూరు అర్బన్ కమిటీ ఈసీ మెంబర్ బి.పరశ్యామ్ ఉన్నారు. రమణమూర్తి తన సుదీర్ఘ పదవి కాలంలో విజయవాడ, వరంగల్, హైదరాబాద్, మచిలీపట్నం, తిరువూరు, అవనిగడ్డ, తెనాలి, నందిగామ, తుని ప్రాంతాల్లో వివిధ హోదాల్లో, వివిధ విభాగాల్లో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి విశేష ఆదరణ పొందారని కొనియాడారు.

వలంటీర్లకు వందనం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలన

విశాలాంధ్ర-తాడికొండ : ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో గురువారం జరగనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమం ఏర్పాట్లను బందరు పోర్టు ఎండీ మేకతోటి దయాసాగర్ బుధవారం పరిశీలించారు. 10 ఎకరాల విస్తీర్ణంలో సభ ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఏపీఎంలు, డ్వాక్రా మహిళలతో సమావేశాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆటోలు, కార్లు, బస్సుల ద్వారా మహిళలు సభ ప్రాంగణానికి చేరుకోనున్నారు. ఈ మేరకు ఆయా గ్రామ పార్టీ నాయకులు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-తెనాలి : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెనాలి పురపాలక సంఘ కమీషనర్ బండి శేషన్న అన్నారు. యన్.వి.ఆర్. కాలనీ సచివాలయం నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండవ విడత బుధవారం జరిగింది. జనరల్ ఓ.పి.199, ఆప్తోమెట్రీషి యన్ ఓపి 108మంది, గైనకాలజి ఓపి 43, డెర్మటాలజీ ఓపి 58 మంది, ఆప్తోమెట్రీషియన్ ఓపి 108మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.కారుమూరు హెలెన్‌నిర్మల, డా.వాడక దేవికావాణి, డా.లిఖిత, డా.వినీల్, మలేరియా సహాయ అధికారి చిరసాని ప్రభాకర్, ఆరోగ్య విస్తరణాధి కారి అందె బాలచంద్రమౌళి, నాదెండ్ల లక్ష్మీ, ల్యాబ్ టెక్నిషియన్స్, నర్సులు, ఆషాకార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీ జేఏసీ పిలుపుమేరకు గుంటూరు జిల్లాలో పనిచేసే ఉద్యోగులందరూ బుధవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన వ్యక్తంచేశారు. అలాగే తాలూకాలలో మండల రెవెన్యూ అధికారులకు ఉద్యోగుల సమస్యలపై మెమోరాండం సమర్పించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్‌కు ఉద్యోగుల సమస్యలపై మెమోరాండం అందజేశారు. ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించవలసిన రూ.21 వేల కోట్ల బకాయిలను తక్షణం చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, 12వ పీఆర్సీ కమిటీ వేసినప్పటికీ ఇంతవరకు కార్యాచరణ నిమిత్తం సిబ్బందిని కూడా ఇచ్చి ఉండలేదని, తక్షణం సిబ్బందిని కేటాయించి తాత్కాలిక భృతి మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏపీ జేఏసీ కన్వీనర్ శెట్టిపల్లి సతీష్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఏ.శ్యాంసుందర్, కూరాకుల శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివ జ్యోతి, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షులు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, విజయ్ బాబు, విజయలక్ష్మి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నరసింహారెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షులు బసవలింగారావు, ఖజానా శాఖ అధ్యక్షులు అలీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మె

విశాలాంధ్ర-తెనాలి : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు కార్మిక ప్రజానుకూల విధానాలకై పోరాడాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు గురుబ్రహ్మం తెలిపారు. గురు బ్రహ్మం మాట్లాడుతూ మోదీ, జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తున్నారని వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదనలను రవాణా, బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలను అంబానీ, ఆదాని ఇతర కార్పొరేట్ కంపెనీలకు అప్పచెబుతున్నారని కార్పొరేట్ కంపెనీలకు లాభాలకు ఆటంకంగా వున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక లేబర్ కోర్టులు తెచ్చిందని విమర్శించారు. విద్యుత్‌శాఖ సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు యిచ్చి ప్రభుత్వం సామాన్య ప్రజల నిత్యావసర వస్తువలన్నింటిపై జీఎస్టీ పేరుతో పన్నులు పెంచిందని చెప్పారు. వ్యవసాయ కార్మికులు రైతులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరుగు గ్రామీణ బందును, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో రెండు బంగారు పతకాలు

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సి టీలో సీఎస్ఐటీ మూడవ సంవత్సరం చదువుతున్న మద్దినేని ఉమా మహేష్ రైఫిల్స్ షూటింగ్‌లో ఒకే చాంపియన్ షిప్‌లో రెండు బంగారు పతకాలు సాధించి సంచలనం సృష్టించాడు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు స్పెయిన్‌లో జరుగుతున్న జూనియర్ వరల్డ్ కప్‌లో రెండు బంగారు పతకాలు సాధించి మువ్వన్నెల జెండాను అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేశాడు. రైఫిల్ షూటింగ్ జూనియర్ వరల్డ్ కప్‌లో ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ బృంద పోటీలలో కూడా బంగారు పతకాన్ని సాధించిన మద్దినేని ఉమామహేష్‌కు సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ కేఎల్‌యూలో క్రీడాకారులకు ప్రత్యేకమైన వసతులు కల్పించడంతోపాటు ప్రోత్సా హకాలు, ఫీజు రాయితీలను ఇస్తున్నామన్నారు. మద్దినేని ఉమామహేష్ లాగా బంగారు పతకాలను సాధిస్తూ రాష్ట్రానికి, దేశానికి, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకు వస్తున్న విద్యార్థులకు సైతం నూరు శాతం ఫీజు రాయితీలు ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావు, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.

పెళ్ళి కానుక అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పట్టణం 17వ వార్డులో మల్లంపల్లి రాములు-అనూష దంపతుల కుమారుని వివాహ సందర్భంగా బుధవారం నూతన వధూవరులు 'రాజేష్-శ్రీకార్తిక'లను ఆశీర్వదించి నారా లోకేష్ పంపిన పెళ్ళి కానుకను తాడేపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, యువత అధ్యక్షులు జి.నాగేశ్వరావు, ఉద్దంటి ధనూజ్, దర్శి హరికృష్ణ, శ్రీనివాస్ మాస్టర్, వంశీ, చందు, మహేష్, పవన్, తదితరులు అందచేశారు.

మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మునుపెన్నడూ ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాజ్యసభ సభ్యులు విజయ్ సాయిరెడ్డి అన్నారు. మంగళగిరి నగరంలోని పాత బస్టాండ్ సెంటర్ అరవింద స్కూల్ పక్కన ఉన్న క్రాకర్స్ గ్రౌండ్‌లో బుధవారం ఆసరా నాలుగో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ సాయి రెడ్డి ఆసరా చెక్కులను మహిళలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ పాల్గొన్నారు.

నేటి సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఫిరంగిపురం : గుంటూరు జిల్లా ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేపూడి వద్ద ఈ నెల 15వ తేదిన జరుగనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ దూడి పోలీసు అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ట్రైల్ కాన్వాయ్‌లో పర్యటించి సీఎం భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ సీఎం సభకు వీవీఐపీలు, వీఐపీలు, మంత్రులు, ముఖ్య అధికారులు హాజరు కానున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బీడీ టీమ్‌లు డ్యూటీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీ చేసి అనుమతిం చాలని కోరారు. రూఫ్ టాప్‌లలో విధులు నిర్వహించే వారు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల పట్ల ఎవరైనా అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జీవీ రమణమూర్తి, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ కె.శ్రీనివాసరావు, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ, తూళ్లూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ పోతురాజు, వెస్ట్ డీఎస్పీ మహేష్, దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శాంత కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు వెంకట్రావు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-పొన్నూరు : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు బుధవారం మెమోరాండం అందజేశారు. ఐక్య ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యా యులు, కార్మికులు పెన్షనర్లు, కాంట్రాక్, ఔట్‌సోర్సింగ్ ఎన్ఎంఆర్ డైలీ ఫుల్ టైమ్ వర్కర్స్ పనిచేస్తున్నారని, ప్రతి ఉద్యోగికి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు ఉన్నాయన్నారు. 12వ పీఆర్సీ కమీషన్ వేసినప్పటికీ నేటికి ఏ మాత్రం ప్రగతి లేదని వారు వాపోయారు. సంఘాలతో చర్చించి, జిల్లాల పర్యటనలు, ఉద్యోగుల నుంచి సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించుటకు చాలా గడువు కావాల్సి వుంటుందని, 2023 జులై 1 నుంచి 12వ పీఆర్సీ అమలు కావలసి ఉండగా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. విపరీతంగా ధరలు పెరిగినందున తక్షణమే మధ్యంతర భృతి (0.05) 30 శాతం తక్షణమే ఉద్యోగులకు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో గౌరవనీయ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నోటీసు సమర్పించి ఏపీ జేఏసీ పక్షాన పొన్నూరు తాలూకా కేంద్రంలో 200 మందితో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం కాకుండా ఆయా సమస్యలను పరిష్కరించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం తక్షణమే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-తాడేపల్లి : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో కొలనుకొండలో ఉన్న యువ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు మాట్లాడుతూ జీవితాన్ని అర్ధాంతరంగా ముగించవద్దు అని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితంలో రన్ ఔట్ కావద్దు అని, స్నేహితుల ప్రభావంతోనో, సినిమాల ప్రభావంతోనో ఎవరో చెప్పారనో, గొప్పల కోసమో, పార్టీ, ఫంక్షన్ అంటూ ఈ మాదక ద్రవ్యాలు అలవాటు చేసుకోవద్దని సూచించారు. కొన్ని ప్రమాదకరమైన మత్తు పదార్థాల వలన గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, ఊపిరితిత్తులపై ప్రభావం, శ్వాసకోశ సంబంధించిన సమస్యలు ఏర్పడతాయని అన్నారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, అకాడమీ నిర్వాహకులు జి.అర్చన, బోధనేతర సిబ్బంది, బ్రో రాబిన్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

16న జరిగే రవాణా బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం డ్రైవర్ ఎవరైనా యాక్సిడెంట్ చేసినట్లయితే పది సంవత్సరాలు జైలు శిక్ష లేదా పది లక్షల రూపా యల వరకు జరిమానా విధించాలని తీసుకొచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఈనెల 16వ తేదీన అఖిలభారత రవాణా కార్మిక సంఘాల దేశవ్యాప్త బంద్ పిలుపు మేరకు ఏఐటీయూసీ నాయకత్వంలో పనిచేస్తున్న ఆటో స్టాండ్ లకు సంబంధించిన కార్మికులు అందరూ కూడా 16వ తేదీ నాడు జరిగే బందులో పాల్గొని విజయ వంతం చేయాలని పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఆరేటి రామారావు, పుప్పాల సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మిక రంగంలో ఉన్నత విద్యలు అభ్యసించినప్పటికీ కొంతమంది కార్మికులు స్వయం కృషితో ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ సౌకర్యం కల్పించా లని, ఆటో డ్రైవర్లకు జీరో ఫైనాన్స్ వడ్డీతో బ్యాంకులు ద్వారా రుణాలు ఇప్పిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం 2019లో మోటార్ వాహ నాల చట్టం సవరణ చేసి చిన్న చిన్న పొరపాట్లకు భారీ మొత్తంలో పెనాల్టీలు, డ్రైవర్లకు జైలు శిక్షలు, 304ఏ లాంటి చట్టాలు జీవో నెంబర్ 21 తీసుకు వచ్చిం దని దీనివలన అన్ని రకాల ఫీజులు పెనాల్టీలు 10 శాతం నుండి 100 శాతానికి పెరిగాయన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచారని అన్ని రకాల స్పేర్ పార్ట్స్ పై జీఎస్టీ 18శాతం వసూలు చేస్తున్నారని, గ్రీన్ టాక్స్ ఇన్సూరెన్స్ ప్రీమి యం పెంచారని, ఇప్పటికే ప్రతి నెల ఫైనాన్సుల కిస్తీలు చెల్లించలేక ఓనర్‌లు, డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్లకు ఎటు వంటి భద్రతా లేదని డ్రైవర్ల పై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన జరిగే రవాణా బందులో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

18న జీ తెలుగులో గదర్-2

విశాలాంధ్ర-గుంటూరు : వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు మరో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఈ ఆదివారం కానుకగా అందించనుంది. 2023లో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించిన గదర్-2ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా తెలుగులో ప్రసారం చేయనుంది. ఎమోషనల్ ఎంటర్‌టైనర్ గదర్-2 ఈ నెల 18న సాయంత్రం 5:30 గంట లకు జీ తెలుగులో ప్రసారంచేయనుంది. అనిల్ శర్మ దర్శకత్వంలో 2001లో వచ్చిన బ్లాక్‌బస్టర్ 'గదర్: ఏక్ ప్రేమ్ కథ'కు సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కింది. బాలీవుడ్ స్టార్‌యాక్టర్స్ సన్నీడియోల్, అమీషా పటేల్, ఉత్కర్ష్ శర్మ నటించిన ఈ చిత్రం 1971 ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో తారా సింగ్ (సన్నీడియోల్) ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కింది. జైలులో ఉన్న తన కుమారుడు చరణ్జీత్సింగ్(ఉత్కర్ష్ శర్మ)ను రక్షించడానికి పాకిస్తాన్ నుంచి తిరిగివచ్చిన తారా సింగ్ ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు అనేది ఈ సినిమా కథ.

డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రశాంతి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు మండల తహసీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌గా ఐ.ప్రశాంతి బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై పొన్నూరు బదిలీ అయినట్లు ప్రశాంతి పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం : మంత్రి విడదల రజిని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత కొన్ని రోజులు క్రితం గుంటూరు శారదా కాలనీలో వాంతులు, విరోచనాలతో మృతి చెందిన గిరిజన యువతి పద్మ కుటుం బానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబుతో కలిసి రూ.5లక్షల చెక్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గుంటూరులో పలువురికి వాంతులు, విరోచనాలతో కూడిన అనారోగ్య సమస్యలు నమోదైనట్లు చెప్పారు. అందుకు గల కారణాలుపై అన్వేషణ చేస్తున్నట్లు తెలిపారు. మంచినీటి సమస్యే కారణమై ఉండొచ్చనే అనుమానాలతో ప్రభావిత ప్రాంతాల్లో పాత పైపులైన్లను పూర్తిగా తొలగిస్తున్నట్లు చెప్పారు. మేయర్ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమస్య పరిష్కారానికి అన్ని చర్య లు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో ముందుకు సాగండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పట్టుదలతో అనుకున్నది సాధించే వారిని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధనలో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొలుత పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని స్థానిక పెద్దలు, పలువురు విద్యా ప్రముఖులతో కలిసి అప్పిరెడ్డి ఆవిష్కరించారు. నూతనంగా నిర్మించిన లేళ్ళ అప్పిరెడ్డి కళావేదిక వాటర్ ప్లాంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.సరోజిని అధ్యక్షతన జరిగిన అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని అన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాడు-నేడు కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వచ్చిన అనేక మంది గ్రామ పెద్దల సహాయ సహకారాలతో పాఠశాలను అన్ని వసతులతో ఆధునీకరించినట్లు చెప్పారు. రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అంకిరెడ్డిపాలెం గ్రామాభివృద్ధికి కంకణం కట్టుకున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి సంకల్పం ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్యామల వెంకట రమణ బ్రహ్మారెడ్డి, అంకిరెడ్డిపాలెం డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి కార్యదర్శి కుర్రి సాంబిరెడ్డి, ఉపాధ్యక్షులు కుర్రి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలోని శారదా కాలని, సంగడి గుంట తదితర ప్రాంతాల్లో ప్రజల అనారోగ్య సమస్యల సత్వర పరిష్కారానికి 7 ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు, త్రాగునీటి స్యాంపిల్స్, ఇంటింటి ఆరోగ్య సర్వే చేపట్టామని, ప్రజలు ఎటువంటి భయాందో ళనలకు గురి కాకుండా ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే మెడికల్ క్యాంప్‌లో సంప్రదించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం శారదా కాలనిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లను పరిశీలించి వైద్యులతో మాట్లాడి క్యాంప్‌ల్లో వైద్య సేవలపై తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ (ఎఫ్‌ఏసి) మధుసూదన్, రెవెన్యూ అధికారి బాలాజీ బాష, ఎస్.ఎస్.లు ఆనందకుమార్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఓటరు చైతన్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజలు ఓటు హక్కు విలువ తెలుసుకుని ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఎన్నికలలో సమర్థులను మంచి వ్యక్తులను ఎన్నుకున్నప్పుడే మన ప్రజా స్వామ్యం పరిరక్షింపబడుతుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఓటరు చైతన్య కరపత్రాన్ని ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఎన్నికల సమయంలో సరైన అభ్యర్థులను ఎన్నుకోకపోతే దేశానికి, రాష్ట్రానికి జరిగే నష్టం అంతా ఇంతా కాదని హితవు పలికారు. ప్రతి ఓటరు ప్రస్తుత దేశ, రాష్ట్ర పరిస్థితులను చర్చించాలని ఆలోచించాలన్నారు. జై ఆంధ్ర మహాదేవ్ మాట్లాడుతూ ఓటు అనేది భారతదేశాన్ని నడిపే ఒక ఉజ్వల శక్తి అని, కానీ నేడు చాలామంది ఓటర్లు రాజకీయ నాయకులకు అమ్ముకునే.. కొనుక్కునే.. వస్తువుగా మారడం దురదృష్ట కరమన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంటూరు పశ్చిమ నియో జకవర్గం ఇన్‌ఛార్జ్ డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ ఓటర్లలో మంచి ఆలోచనలను రేకెత్తించేందుకు కరపత్రమును ప్రచురించి, ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నిర్మలరాణి, పావని, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

13, 54 డివిజన్ల కార్పొరేటర్లతో ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 13వ, 54వ డివిజన్ల కార్పొరేటర్లు సంకూరు శ్రీనివాస్, మల్లవరపు రమ్య ఆధ్వర్యంలో గాంధీనగర్, సంగడిగుంట నందు వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్.నూరి ఫాతిమా బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే ఒక కుటుంబ పార్టీ కాదనీ, ఇది రాష్ట్రంలో ఉంటున్న ప్రతీ పేదవాడి పార్టీ అని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడే ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం కల్పించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షులు కర్నూమా, వైసీపీ నాయకులు అగ్గిపెట్టి రాజు, తోట అంజనేయులు, వాక శ్రీనివాస్ రెడ్డి, రవిరాజ్, దాస్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి అభివృద్ధి పట్టదు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నేతలు ఈ రాష్ట్రం మీద పడి దోచుకొని తినడం తప్ప వారికి అభివృద్ధి పట్టదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర అనానరు. బుధవారం స్థానిక 29వ డివిజన్ ఏటి అగ్రహారంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని నేతృత్వంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటి పత్రాలను పంపిణి చేసారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీసీ వర్గాల పై దాడులు ఎక్కువయ్యా యని, టీడీపీ మినీ మేనిఫెస్టో లోని సూపర్ సిక్స్ పథకాల్లో చెప్పిన విధంగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ సైదా, రాంప్రసాద్, వినయ్ బాబు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

గుంటూరు సిటీ, ఏటుకూరు రోడ్డు, బృందావన్ ఎన్‌క్లేవ్ ఆర్చిడ్ సౌత్ బ్లాక్, ఫ్లాట్ నెం.302రు కాపురస్తులు లేటు వినుకొండ కొండయ్య గారి కుమారుడు **వినుకొండ శ్రీనివాస రావు** (సెల్:**9440214709**). నా భార్య వినుకొండ ప్రమీల గారి పేరిటకు పెదకూరపాడు సబ్ రిజిష్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం.**152/2010** ఒరిజినల్‌ను ది.**07-02-2024**న గుంటూరు ఆర్టీవో ఆఫీసు వద్దనున్న ఫొటోస్టాట్ సెంటర్ వద్ద పోగొట్టుకున్నాను. నా భార్య ది.**22-10-2019**న మరణించినారు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఏపీఎస్ఆర్టీసీలో ఉత్తమ ప్రమాదరహిత డ్రైవర్ ముస్తఫాకు క్యాష్ రివార్డ్

విశాలాంధ్ర-వినుకొండ : ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు రోడ్డు భద్రత మాసోత్స వాలు ముగింపు సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిపో మేనేజర్ బి. కోటేశ్వర నాయక్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు షేక్ అబ్దుల్ రజాక్ హాజరయ్యారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు గురి ంచి, బస్సు డ్రైవర్లు ప్రమాదములు జరగకుండా తీసుకోవలసిన సూచనలు, సలహాలు తెలియజేశారు. ఉత్తమ ప్రమాదరహిత డ్రైవర్లుగా విధులు నిర్వహించిన డ్రైవర్లకు నగదు బహుమతి అందజేశారు. వారిలో వరుసగా 4వ సారి బహుమతి అందుకున్న ఎస్కే ముస్తఫా, బి గోవింద నాయక్ లకు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజీ ఇంచార్జ్ సుగ్రీవ నాయక్, ఎల్ హెచ్. ఎస్ కె. ఖాజా, సుగుణ, మల్లీశ్వరి, కె. రాజామణి మరియు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అల్ ఇండియా స్థాయిలో విశ్వాసాయి జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర-వినుకొండ : అల్ ఇండియా స్థాయిలో జె.ఈ.ఈ మెయిన్స్ 2024 రీజల్ట్స్‌లో వినుకొండ విశ్వా సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయం సాధిం చారని ఈ విజయం సాధించడం తమకెంతో గర్వంగా ఉందని కళాశాల డైరెక్టర్ డాక్టర్. యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సి పాల్ శ్రీవల్లీ పావనిలు తెలిపారు. కళాలలో జె.ఈ.ఈ మెయిన్స్ లో మెరిట్ సాధించిన కె విజయ దుర్గ 97%, వి.సీతారామ శర్మ 92%, ఆర్. రాజేంద్ర 89%, వై అమృత వర్షణీ 77%, బి లెల్లి సరోన్ 68% విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందిచారు. కళాశాల స్థాపించిన నాటి నుండి జె.ఈ.ఈ మెయిన్స్ లో ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అందుకు ప్రతి ఫలాలే నేడు తమ కళాశాల విద్యార్థులు జె.ఈ.ఈ మెయిన్స్‌లో రాణించడం అన్నారు. కళాశాల మ్యాథమెటిక్స్ సీనియర్ ఫ్యాకల్టీ బి రాఘవేంద్రరావు, ఫిజిక్స్ సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ కె రామారావు, సీనియర్ ఇంగ్లీష్ ఫ్యాక్టరీ పోకా హనుమంతరావు, మ్యాథమెటిక్స్ అధ్యాపకులు కె. ప్రసాద్ శ్రీమతి భారతి, కెమిస్ట్రీ అధ్యాపకులు సుకుమార్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ రాజ గోపుర నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మండలం మదమంచిపాటి వీరాంజనే యస్వామి స్వారి వారి దేవస్థానం నందు రాజగోపురం నిర్మాణానికి దేవాదయ శాఖ సి.జి.యఫ్ ఫండ్ కింద 50 లక్షల రూ. నిధులు మంజూరు చేయటం చాలా సంతోషంగా ఉందని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. మ్యాచింగ్ కాంట్రిబూషన్‌గా చెల్లించవలసి న 16 లక్షల 66వేల రూ. గొల్లపాలెం వాస్తవులు కాటిరెడ్డి కోటిరెడ్డి చెల్లిం చారు. శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు కోటిరెడ్డికి శాలువా కప్పి సన్మానించారు.

సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

విశాలాంధ్ర-వినుకొండ : వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని కారంపూడి రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో సామూహిక అక్షరా భ్యాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మొదటిసారిగా ఓనమాలు వ్రాయిస్తూ అక్షరాభ్యాసం చేపించారు. ప్రిన్సిపల్ ఏ. ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు జ్ఞానభిక్షను ప్రసాది ంచే వేదమాత తన చల్లని చూపులతో ఆశీర్వదించే శక్తి స్వరూపిణి అక్షరాభ్యాసానికి అధిదేవత, ప్రణవ స్వరూపిణి "సరస్వతీదేవి" చల్లని దీవెనలతో చిన్నారులకు ఈరోజు అక్షరాభ్యాసం చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, కోఆర్డినేటర్ కె శ్రీనివాసరావు, డీన్ మసూద్ బాషా, ఇంచార్జ్ లక్ష్మణ్, చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాఘ శుద్ధ పంచమి వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ : గీతాంజలి పాఠశాలలో మాఘ శుద్ధ పంచమి వేడు కలు అనగా (వసంత పంచమి) సరస్వతి అమ్మ వారి పుట్టినరోజు వేడుకలు బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి టి. కృష్ణవేణి మాట్లా డుతూ వసంత పంచమి రోజున విద్యార్థిని, విద్యార్థులు అమ్మవారిని మనసారా ధ్యానించి అమ్మవారు ప్రసాదించే జ్ఞానాన్ని పొందగలరని, ఈ వసంత పంచమి వేడుకలు మన దేశం అంతట ఘనంగా జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీ వై ల్ కిషోర్,విద్యార్థిని, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నారులతో సరస్వతి దేవి పూజ కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగింది. పలువురు చిన్నారులు సరస్వతి దేవి వేషధారణ లతో అందరి చూపు లను ఆకర్షించడం జరిగింది. చిన్నారుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించడం జరిగింది.

ప్రజల మనిషి 'తులసి ధర్మచరణ్'

విశాలాంధ్ర-గుంటూరు : వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ జన్మదిన వేడుకలు స్థానిక అరండల్ పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యాలయ సిబ్బంది, సన్నిహితులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ధర్మచరణ్ కట్ చేసారు. అనంతరం వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కష్టం, స్వయంకృషికి మారుపేరు ధర్మచరణ్ అని, పట్టుదలే ఆయన విజయమని, చిన్న వయస్సు నుంచే సేవని ఇంటి పేరుగా మార్చుకొని, ఎంతో మంది పేద విద్యార్థులు, క్రీడాకారులకు ఆర్థికంగా వెన్నంటే ఉంటున్నారన్నారు. భవిష్యత్‌లో ప్రత్యక్ష రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రజా సమస్యలపై పోరాడి ప్రజలకు మరింత చేరువకావాలని ఆకాంక్షించారు.

ఆశ్రమ పాఠశాల, వృద్ధాశ్రమంలో అన్నదానం: తులసి ధర్మచరణ్ సన్నిహితులు, హోటల్ సుభాని నిర్వాహకులు తాడి శ్రీనివాస్, తిమ్మిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం భ్రమరాంబపురం కాలనీలోని లీమా హోమ్ ఆశ్రమ పాఠశాలలోని చిన్నారులకు, డొంకెన మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెడ్డిపాలెంలోని మానవతా వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రేజేటి రామకృష్ణ ఆధ్వర్యంలో నల్లచెరువులో నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేయాలని తనకు దిశానిర్దేశం చేస్తే ఖచ్చితంగా గెలిచి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ కంతా జగదీష్, సుంకర సతీష్, చెన్నంశెట్టి శివ, ఆంజనేయులు, కన్నసాని బాజి, యర్రబోతు వాసు, కన్నెగంటి బాలు, ఆళ్ళ శ్రీనివాసరావు, గుబ్బా సతీష్, గాజుల సాయిరాం పాల్గొన్నారు.

ఘనంగా మొహమ్మద్ నసీర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొహమ్మద్ నసీర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో, గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఈపూరు : రైతుల ఆత్మహత్యలు ఆపడం లోనూ, రైతుల సమస్యలు పరిష్కరిం చడంలోను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాస రావు అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ కిసాన్ మోర్చా, రైతు సంఘాలు ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఈపూరు, ముప్పాళ్ళ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లౌకికతత్వాన్ని కాపాడుకునేందుకు రైతుల ఆత్మహత్యలు ఆపడానికి, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులో భాగంగా పంటలకు సి ప్లస్ టు 50 శాతం అమలు చేయాలని, రైతుల అప్పులను రద్దు చేయాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్ రంగ ప్రవేటీకరణ బిల్లును రద్దు చేయాలని, రైతు మోటార్లకు మీటర్ల బిగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ముప్పాళ్ళలో సీపీఐ శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాల గురించి చర్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఊట్ల రామారావు, సూరే అప్పారావు, చిలకాబత్తిన సత్యానందం, కొప్పెర పరమేష్, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలకు జీఓ విడుదల చేయాలి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను జీఓ ఇచ్చి వెంటనే అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బీఎస్ గిరి కుమార్‌కు మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి జీఓలు వెంటనే విడుదల చేసి, అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సబ్బులు, నూనెలు, యూనిఫామ్, చెప్పులు వెంటనే ఇవ్వాలని, పనిముట్లను రిపేర్ చేయించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు కె.సీతారామయ్య కుంభ, కొండలు, మార్తమా, పద్మ, కుంభ వెంకటేశ్వర్లు, కాంద్రగుంట ఎల్లమంద తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల వద్ద నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చిలకలూరిపేట నియోజకవర్గ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తలారి ద్యానీ, మేకపోతుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, మోడరన్ జూనియర్ కళాశాల, మోడ్రన్ డిగ్రీ కళాశాల, చైతన్య జూనియర్ కాలేజ్, భాష్యం స్కూల్, ఆర్‌వీఎస్ సీవీఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఎస్‌కేఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులచే సంతకాలను సేకరించారు. జాతీయ విద్యావిధానం 2020 రద్దు చేయాలని, అన్ని విద్యాలయాలలో టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరుతూ విద్యార్థి లోకం నుంచి ఐదు కోట్ల సంతకాలను సేకరించి ప్రభుత్వాలకు పంపించటం జరుగుతుందన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమం ఫిబ్రవరి 17వ తేదీ వరకు నిర్వహిస్తామ న్నారు. మొదటి రోజు 300 మంది విద్యార్థుల వద్ద నుంచి సంతకాలు సేకరించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పి.గోపీచంద్, కె.లిఖిత్ తదితరులు ఉన్నారు.

అమరావతిపై నిజాల్ని చూపిస్తుంటే ఉలుకు ఎందుకు?: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఎట్టకేలకు రైతుల పక్షాన ఎవరో వచ్చి... అమరావతిపై నిజాల్ని చూపిస్తుంటే జగన్, వైసీపీకు అంత ఉలుకు ఎందుకు... అని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. అమరావతి విషయంలో జగన్, వైసీపీ ఎలాంటి కుట్రలు, ఏ తప్పు చేయకుంటే, రైతుల త్యాగాలకు ద్రోహం చేయకుంటే రాజధాని ఫైల్స్ సినిమా ట్రైలర్లు చూసే ఎందుకంత భయపడుతున్నారు? వ్యూహం, యాత్ర వంటి సినిమాలకు లేని అభ్యంతరాలు రాజధాని ఫైల్స్ విషయంలో ఎందుకు? అని ధ్వజమెత్తారు. రాజధాని ఫైల్స్ చిత్రం విషయంలో వైసీపీ నాయకులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు, కోర్టుల్లో కేసులు, వివాదాలపై చిలకలూరి పేటలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవర్నీ అప్రతిష్టపాలుజేయాల్సిన అవసరం, అగత్యం రాజధాని ఫైల్స్ చిత్ర నిర్మాతలకు లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఏం చేశారో, ఆయన మంత్రులు ఏం మాట్లాడుతున్నారో రాష్ట్రంలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు.. దేవతలు దీవించిన ప్రజారాజధాని అమరావతి గొంతు పిసికి చంపాలని చూస్తోంది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలియదా? అని ఆయన నిలదీశారు. గతేదాది డిసెంబర్‌లోనే రాజధాని ఫైల్స్‌కు సెన్సార్ సర్టిఫికేట్ లభించింది. అప్పుడు లేని కంగారు ఇప్పుడెందుకు? మరికొన్ని రోజుల్లో ప్రజల ముందు అన్ని విషయాలు వస్తాయని అన్నారు.

అనిల్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంటు ఇన్‌ఛార్జిగా నియమితులై మొట్టమొదటిసారిగా అధికార పర్యటనలో భాగంగా నరసరావుపేట వెళ్లే అనిల్‌కుమార్ యాదవ్‌కు చిలకలూరిపేటలో ఘన స్వాగతం లభించింది. పార్టీ సమన్వయకర్త మల్లెల రాజేష్ ఆధ్వర్యంలో కార్లు.. ద్విచక్రవాహనాలలో గ్రామాలు, పట్టణం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా మధ్యాహ్నం బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకున్నారు. నెల్లూరు నుంచి రోడ్డు మార్గాన విచ్చేసిన అనిల్‌కుమార్ యాదవ్ బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి దేవాల యంలో పూజలు నిర్వహించారు. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్ వద్ద 30 అడుగుల భారీ గజమాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనిల్‌కుమార్ యాదవ్‌ని స్వాగతించారు. పురుషోత్తమపట్నంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి అనిల్ కుమార్ యాదవ్, మల్లెల రాజేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవాలయం వద్దకు చేరుకొని పూజలలో పాల్గొన్నారు. మద్దిరాల వద్ద చిలకలూరిపేట ఎంపీపీ, జడ్పీటీసీ, మూడు మండలాలల పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలో ఎంపీపీగా పాలనా పగ్గాలు చేపట్టిన సంపూర్ణమ్మ ఆధ్వర్యంలో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీగా పాముల సంపూర్ణమ్మ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎంపీపీగా సేవలందించిన దాసరి చౌడేశ్వ రిని అభినందిస్తూ రాజకీయ ఉన్నతికి స్థానిక సంస్థల ఎన్నికలు దోహదపడతాయన్నారు. ఆ క్రమంలోనే సంపూర్ణమ్మ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఎంపీడీవో శంకర్రావు ఆమె చేత ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీ సంపూర్ణమ్మ మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలకు తోడ్పడిన పిన్నెల్లి కుటుంబానికి, సహచర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సొంతిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి, వైసీపీ నేతలు పూజల రామయ్య, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ పర్యటనకు వస్తున్న ప్రజాదరణ ఓర్చుకోలేక ఆటంకాలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : నానాటికి జనసేన-టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి భయపడి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటనలకు అడుగడునా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటంకాలు కలిగిస్తుందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన ఉండగా, హెలిప్యాడ్ ఏర్పాటుకు ఆర్ అండ్ బీ అధికారులు అనుమతి నిరాకరించడంతో రద్దైన విషయం విదితమే. ఈ విషయంపై బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశం ప్రభుత్వ దోరణిని తీవ్రంగా ఖండించారు. పవన్ కళ్యాణ్ ఎక్కడ ఏ సభ ఏర్పాటు చేసినా వస్తున్న విశేష స్పందన జగన్ ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని, ఇందుకే ప్రతిసారి పవన్‌కళ్యాణ్‌ను అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు మార్గన కాకుండా హెలికాప్టర్‌లో వెళ్తున్నా ఇదే ప్రవర్తించటం అప్రజాస్వామికమని, పవన్ పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్న విషయం సామాన్య ప్రజలకు సైతం అర్ధమైంద న్నారు. ఇదే ప్రాంతంలో పలువురి హెలిపాడ్‌లకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం పవన్ కళ్యాణ్ విషయంలో అనుమతి నిరాకరించటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ మీద అక్కసుతోనే ఇటువంటి అలజడి సృష్టిస్తున్నారని, రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన ప్రజాస్వామ్యం అమలు కావడంలేదని అన్నారు. అసమర్థ పాలన ఎక్కడ బయటపడుతుందో అని పవన్ కళ్యాణ్ పర్యటనలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌పై విషం చిమ్మితే చూస్తూ ఊరుకోమని ఎంతవరకైనా పోరాడుతామని హెచ్చరించారు.

ఘనంగా దామోదర సంజీవయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : భారతదేశ మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు స్థానిక అడపా బజార్‌లోని నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాల యంలో సంఘ సభ్యులచే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మెండెం శ్రీనివాసరావు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య 29 సంవత్సరాల వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, అలాగే 39 సంవత్సరాలకే ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి 2వ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారని చెప్పారు. రెండుసార్లు ఏఐసీసీ జాతీయ అధ్యక్షులుగా కూడా పనిచేశారని చెప్పారు. వివిధ శాఖలలో కేంద్ర మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు చెవుల కోటిరామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి జంగా నరేంద్ర, చెవుల నాగరాజు, జి.వెంకటేశ్వర్లు, వై.ఏడుకొండలు, ఎం.ఈశ్వరరావు, నాగవెంకట సుబ్బారావు, రంగస్వామి, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో: గుంటూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, వరప్రసాద్, శివ, నాయక్, సుదీర్ బాబు, షేక్ మౌలాలి, రామకృష్ణ, మల్లెల మోషే, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్

గుంటూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి అన్నారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఉదయం కలక్టరేట్ లోని వీసీ హాల్‌లో వారి చిత్రపటానికి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళిఅర్పించారు. సమాజానికి వెనుకబడిన వర్గాలకు ఎంతో సేవ చేశారని, ప్రతి ఒక్కరు ఆయన బాటలో నడవాలన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో పెద్ది రోజా , డీడీ సాంఘీక సంక్షేమశాఖమధుసూధనరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తాడికొండ : దివంగత మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ దళిత నేత దామోదరం సంజీ వయ్య జయంతిని గుంటూరు నగరంలోని ప్రత్తిపాడు శాసనసభ్యులు మేకతోటి సుచరిత కార్యాల యంలో బందరు పోర్టు ఎండీ మేకతోటి దయాసాగర్ బుధవారం ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చిమట పూర్ణచంద్రరావు, తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్‌రెడ్డి, రావెల సర్పంచ్ రావెల శైలజ, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినుకొండ : స్థానిక నరసరావుపేట రోడ్‌లోని డాక్టర్ బీర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా బుధవారం మాల మహానాడు అన్నవరపు కమిటీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజక వర్గ ప్రెసిడెంట్ పిడతల దేవదాసు మాట్లాడుతూ దాళితులలో తొలి ముఖ్య మంత్రి అయినా గానత డీ. సంజీవయ్య ముఖ్యమంత్రి కేదక్కుతుందని రాజ్యాంగం ఇచ్చిన అవకాశాన్ని దళితులు చదువుకున్న యువకులు రాజకీయ అవగాహనతో రాజకీయాలలోకొచ్చి మంచి నాయకులు కావాలని, రాబోయే రోజులలో రాజ్యాధికారం సాధించాలని ఆయన సేవలను కొని ఆడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి పిడుగు. విజయ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

గుంటూరు వైద్యం : విలువలు గల రాజకీయ నాయకుడిగా దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా..కేంద్ర మంత్రిగా..ఏఐసీసీ అధ్యక్షుడిగా పని చేసిన దామోదరం సంజీవయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన సేవలు మరువలేనివని సీనియర్ విశ్లేషకులు ఎన్.సదాశివం కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సదాశివం మాట్లాడుతూ రాజకీయాలంటే రాజీపడటం..సంపద పోగేసుకోవటం..కుర్చీ కోసం కొట్లాడుకోవటం కాదని, నమ్మిన విలువల కోసం జీవితాంతం నిలబడటమేనని ఆచరణలో చూపిన ఆదర్శనేత దామోదరం సంజీవయ్య అని అన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ దళితుడిగా జీవితంలో ఎంతో వేదనను అనుభవించినా ఏనాడూ తన ఆత్మ విశ్వాసాన్ని.. ఆత్మ గౌరవాన్ని వదులుకోని మహా నాయకుడు దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. చంద్రశేఖర్, జోస్టెన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు : పేద ప్రజలకు, వృధ్యాప్యంలో ఉన్నవారికి అండగా నిలిచే సంక్షేమ పథకాలకు ఆద్యుడు మాజీ ముఖ్యమంత్రి దివంగత స్వర్గీయ దామోదరం సంజీవయ్య అని జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా లాలుపురంలోని పార్టీ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి చట్టాల త్రినాధ్, కాటూరి శ్రీనివాసరావు, నాగం అంకమ్మరావు, తోట శివ, అక్కి రవి, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, తన్నీరు రాము, శృంగారపు భాస్కర్, కన్నా గోపి, శీలం హరి, శీలం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మున్సిపల్ కమిషనర్ క్రిష్ణవేణిని మర్యాదపూర్వకంగా కలిసిన వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు యువనేత బొల్లా గిరిబాబు. మున్సిపల్ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. అలాగే పట్టణంలో పారిశుద్ధం పై మరింత శద్ధ చూపేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎస్ఐ వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-పెదకూరపాడు: నూతన ఎస్సైగా వెంకటేశ్వర్లు బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన అమరావతి ఎస్సైగా పనిచేసే సాధారణ బదిలీపై పెదకూరపాడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో శాంతి యుత వాతావరణం నెలకొల్పుతామని అన్నారు. మండల ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.

రైతు భరోసా కేంద్రంలో టీవీ చోరీ

విశాలాంధ్ర-శావల్యాపురం: గుర్తు తెలియని వ్యక్తులు రైతు భరోసా కేంద్రంలోకి చొరబడి టీవీని దొంగలించిన ఘటన మండలంలోని మతుకుమల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. విదులలో బాగంగా బుదవారం ఉదయం పది గంటల సమయంలో రైతుబరోసా కేంద్రం వద్దకు వచ్చిన వివిఎ గది తాళం పగలగొట్టినట్లు గుర్తించి సమాచారాన్ని తనపై ఆదికారి ఎఓకి, అలాగే ఎస్సైకి ఫోన్ చేసి తెలిపారు. తక్షణమే ఎఓ ప్రవీణ్, ఎస్సై సురేష్ లు ఘటనా స్థలాన్ని పరిశీలించగా సుమారు రూ.50 వేలు విలువైన టీవి అపహరణకు గురైనట్లు గుర్తించారు. వివిఎ లిఖితపూర్వకంగా స్థానిక పొలిస్ స్టేషన్ నందు పిర్యాదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలపై పూర్తి పర్యవేక్షణ ఉంచాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ పాఠశాలలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి అన్నారు. పాత బస్టాండ్ సెంటర్ లోని జిల్లా పరీక్షా భవన్‌లో గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యాబోధన విషయంలో రాజీపడవద్దని, విద్యాభివృద్ధికి విస్తృతరీతిలో కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వ ఆశయా లకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. విద్యాశాఖలో జరుగుతున్న కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. పాఠశాలల్లో ఐఎఫ్‌పీలను పూర్తి స్థాయిలో వినియోగించడంతో పాటు, 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను ఉపయోగించుకునేలా చూడాలని తెలిపారు. ఐఎఫ్ పీల ఇన్‌స్టలేషన్‌కు ముందుగా పాఠశాలల్లో విద్యుద్దీకరణ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి, గుంటూరు, తెనాలి డీవైఈఓలు పి.వెంకటేశ్వరరావు, ఎం.నిర్మల, గుంటూరు ఈస్ట్ ఎంఈఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి అసెంబ్లీ సీటు ప్యూర్ పద్మశాలికే ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : సామాజిక న్యాయం ప్రకారం మంగళగిరి అసెంబ్లీ సీటు వైసీపీ ప్యూర్ పద్మశాలీకే ఇవ్వాలని వైసీపీ మంగళగిరి పట్టణ మాజీ ఉపాధ్యక్షులు కొసనం శ్రీనివాసరారావు అన్నారు. బుధ వారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పద్మశాలీ కోటాలో కులాంతర వివాహం చేసుకున్న గంజి చిరంజీవి పదవి పొందడానికి అర్హుడు కాదని గంజి చిరంజీవిని తక్షణం ఇన్‌చార్జ్ పదవి నుంచి తొలగించి పద్మశాలీల ఆత్మగౌరవం కాపాడాలన్నారు. నారా లోకేష్ తన కన్నా ఏ విషయంలోనూ అధికుడు కాదని నారా లోకేష్‌ని ఓడించే సత్తా తనకుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గాదె బ్రహ్మేంద్రారెడ్డి, పారేపల్లి పూజిత, షేక్ ఖలీల్ పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో ఘనంగా ఇండస్ట్రీ అకడమియా ఇంటరాక్షన్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర-గుంటూరు : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'ఇండస్ట్రీ అకడమియా ఇంటరాక్షన్ ప్రోగ్రామ్‌ను' బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకాక్‌లోని అపారి(ఆసియా-ఫసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను అధ్యాపకులతో మాత్రమే కాకుండా ఇండ్రస్ట్రీ ప్రముఖులతో బోధిస్తే సాంకేతికంగా ఉత్తమ ఫలితాలను రాబట్టువచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఇక్రిసాట్ మాజీ సైంటిస్ట్ డాక్టర్ కేపీసీ రావ్, హైదరాబాద్‌లోని ఎన్ఐపీహెచ్ఎం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేపీ విధు, ఖరగ్‌పూర్‌లోని ఐఐటీ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

వాహన యజమానులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వాహన యజమానులు వాహనమునకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మసోత్సవాలు సందర్భంగా బుధవారం గుంటూరు జేకేసీ కాలేజీ రోడ్డులో ఉన్న ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయంలో వాహన డ్రైవర్లకు- ఇన్సూరెన్స్‌పై- రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న వాహన యజమా నులకు, వాహన డ్రైవర్లకు ఇన్సూరెన్స్ ప్రాముఖ్యత..వాహనాలకు ఇన్సూ రెన్స్ లేని ఎడల దాని వల్ల కలిగే నష్టం గురించి వివరించారు. అదే విధంగా వాహనం నడుపు సమయంలో ప్రమాదం జరిగిన ఎడల వాహనమునకు ఇన్సూరెన్స్ లేనిచో ఎదురయ్యే సమస్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో గుం టూరు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బ్రహ్మారెడ్డి, సీనియర్ డివిజనల్ మేనేజర్ టి.శేఖర్, ఇన్సూరెన్స్ సర్వేయర్ గిరి, కె.ప్రసాద్, పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగులకు పండ్లు, మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్) ఆసుపత్రిలో లూజు మోషన్స్‌తో చికిత్స పొందుతున్న రోగులకు వివిధ రకాలైన పౌష్టిక ఆహారాన్ని మంగళవారం నుంచి ప్రారంభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. రోగులకు ప్రతి 4గంటలకొకసారి పాలు, మజ్జిగ అందజేస్తున్నట్లు చెప్పారు. పెరుగు అన్నం, పండు, గోరు వెచ్చని మంచినీరు, రొట్టె, కోడిగుడ్లు, ఔషధాలను నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఆసుపత్రిలో చేరిన బాధితులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వైద్యులు, వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. రోస్టర్ ప్రకారం సిబ్బందిని నియమించామని, అత్యవసర సమయంలో విధులకు డుమ్మా కొట్టే వారిపై ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన సహించేది లేదని, లూజు మోషన్స్ ఉన్న బాధితుల కోసం ప్రత్యేకంగా ఒక వార్డును కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.